లక్ష్యం దిశగా అడుగులు!

పంచాయతీల్లో వేగంగా పన్నుల వసూళ్లు

- మొత్తం వసూలు చేయాల్సింది రూ.36.55 కోట్లు
- ఇప్పటి వరకు వసూలు చేసింది రూ.18.73 కోట్లు
- ఈ నెలాఖరు నాటికి టార్గెట్ చేరుకునేందుకు అధికారులు చర్యలు
- ఇటీవలే దిశా నిర్దేశం చేసిన పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్



కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పేద, మధ్య తరగతి వర్గాలకు ఆయా పథకాల ద్వారా అందుతున్న ఆర్థిక సహకారం ... తదితర కారణాలతో జిల్లాలోని మెజారిటీ గ్రామ పంచాయతీల్లో పన్నులు వేగంగా వసూళ్లవుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పన్నుల వసూలులో నిర్ణయించిన లక్ష్యాన్ని చేరుకోవడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 50 శాతం పన్నులు, పన్నేతరములు వసూలయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే గ్రాంట్లకు అనుబంధంగా ... స్థానిక వనరులను సమీకరించుకోవడం, పన్నులు వసూలు చేయడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే భావనతో మెజారిటీ పాలకవర్గాలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాయి. అన్ని గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరములపై దృష్టి సారిస్తే ఆయా గ్రామ పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ అయ్యే అవకాశాలు ఉంటాయనే అధికారులు చేసిన సూచనలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. పన్నుల వసూళ్లకు సంబంధించి డివిజన్ల వారీగా లక్ష్యాలను కేటాయించడం, పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీలకు ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. అలాగే డీపీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రతి రోజు పర్యవేక్షణ ఏర్పాటు చేయడం వల్ల పన్నుల వసూళ్లలో ప్రగతి కనిపిస్తోంది. పన్నుల వసూళ్లకు సంబంధించి ఇటీవల పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ కన్నబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా పని చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే క్షేత్ర స్థాయిలోని కార్యదర్శులు, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

సర్పంచుల పాత్ర కీలకం ...

గ్రామ పంచాయతీ పరిధిల్లో పన్నులను వసూలు చేయడం, వాటిని అభివృద్ధి పనులకు వెచ్చించుకునే విషయంలో గ్రామ సర్పంచులది కీలకపాత్ర. ఆయా గ్రామ పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని పూర్తిగా గ్రామాభివృద్ధి కోసం వెచ్చించుకునే సౌలభ్యం ఉంది. అయినా ... వివిధ గ్రామాల సర్పంచులు పన్నుల వసూళ్లపై పెద్దగా దృష్టి సారించనట్లు తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం, ఇతర గ్రాంట్ల పైనే గ్రామ పంచాయతీ పాలకవర్గాలు దృష్టి కేంద్రీకరించాయే తప్ప స్థానిక వనరుల నుంచి పంచాయతీలకు వచ్చే ఆదాయాల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీల్లో పన్నులు(ఇంటి పన్ను, లైబ్రరీ సెస్సు, కుళాయి పన్ను) పన్నేతరముల (మార్కెట్ వేలాలు, షాపింగ్ అద్దెలు, లైసెన్స్ ఫీజులు, కుళాయి ఫీజులు, భవన నిర్మాణ ఫీజులు) రూపంలో సొంత వనరులను సమీకరించుకోవడంలో సర్పంచులు తమ పాత్రను పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి అవసరం

అనేక గ్రామ పంచాయతీల్లో దశాబ్దం క్రితం ఉన్న ఇళ్ల సంఖ్యనే నేటికి లెక్కల్లో చూపుతున్నారు. జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో దాదాపు 50 శాతం గ్రామ పంచాయతీలు భౌగోళికంగా విస్తీర్ణం చెందాయి. ఈ నేపథ్యంలోనే ఆయా గ్రామ పంచాయతీల్లో కొత్త కాలనీలు ఏర్పాటయ్యాయి. అయితే కొత్తగా గ్రామ శివారుల్లో ఏర్పాటవుతున్న కాలనీలు, కొత్త ఇళ్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేకపోవడం వల్ల ఆయా గ్రామ పంచాయతీలు ప్రత్యక్షంగా పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని కోల్పోతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి.

- మద్దికెర గ్రామ పంచాయతీల్లో పన్నులు, పన్నేతరములు కలిపి మొత్తం రూ.81,33,157 వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.68,99,241 వసూలు చేశారు.
- కోడుమూరు గ్రామ పంచాయతీలో రూ.1,79,26,291లకు గాను రూ.1,39,26,933 వసూలు చేశారు.
- గోనెగండ్ల పంచాయతీలో రూ.40,74,769కు ఇప్పటి వరకు రూ.21,76,311 వసూలయ్యాయి.
- పై గ్రామ పంచాయతీలు పన్నుల వసూళ్లలో ప్రగతికి కొన్ని ఉదాహరణలు మాత్రమే. జిల్లాలో మెజారిటీ గ్రామ పంచాయతీల్లో అదే స్థాయిలో పన్నులు వసూళ్లవుతున్నాయి.

జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు ...	484
మేజర్ గ్రామ పంచాయతీలు ...	16
మైనర్ గ్రామ పంచాయతీలు ...	468

ఏప్రిల్ 1వ తేది నాటికి వసూలు లక్ష్యం (అరియర్స్‌తో కలిపి)

పన్నులు :	రూ. 28,26,33,111
పన్నేతరములు :	రూ 8,29,26,528
మొత్తం:	రూ. 36,55,59,639
వసూలు చేసింది ...	
పన్నులు :	రూ.13,91,95,060
పన్నేతరములు :	రూ. 4,81,47,180
మొత్తం:	రూ.18,73,42,240

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

- అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశం

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వార అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాలు, వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగ్‌లు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని ఆదేశించారు. ప్రస్తుతం హైవేలు, మెయిన్‌రోడ్ల పక్కన ఉన్న హోర్డింగ్‌లను కూడా సమాన ప్రతిపాదికన అన్ని రాజకీయ పార్టీలకు కేటాయించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున కొత్తగా అనుమతులు ఏ మాత్రం ఇవ్వొద్దన్నారు. ప్రైవేట్ ఇళ్లు లేదా భవనాలపై పెద్ద హోర్డింగ్‌లు ముందస్తు అనుమతి తరువాత అనుమతించాలన్నారు. కానీ, వాటి భద్రత, నిర్మాణాలపై తనిఖీ చేసి నివేదిక తీసుకున్న తరువాత మాత్రమే అనుమతించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచి స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు పనిచేసేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సీఎం బస్సు యాత్ర సన్నాహాక సమావేశం

కర్నూలు టౌన్ : ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో వైఎస్‌ఆర్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేసింది. ఇప్పటికే సిద్ధం సభలు విజయవంతం కావడంతో ఈనెల 27 వ తేదీ నుంచి ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. ఇడుపుల పాయ నుంచి ఉత్తరాంధ్ర వరకు ఈ యాత్ర సాగనుంది. ప్రొద్దుటూరులో ఈనెల 27న ప్రారంభమయ్యే ఈయాత్ర ఈనెల 30 వ తేదీ ఎమ్మిగనూరుకు చేరుకుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం కొత్తబస్టాండ్ సమీపంలోని ఒక హోటల్‌లో ముఖ్యమంత్రి బస్సు యాత్రకు సంబంధించి సన్నాహాక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంఎల్‌సీ రామసుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన అన్ని నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, పరిశీలకులు హాజరవుతున్నారన్నారు. అందరం కలిసి బస్సు యాత్ర రూట్ మ్యాప్‌పై చర్చిస్తామన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీకి ఉల్చాల గ్రామ పెద్దల మద్దతు



కోట్లహర్ష, సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉల్చాల గ్రామ పెద్దలు

కర్నూలు కల్చరల్ : కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన పెద్దలు సత్యపాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజారెడ్డి, శ్యామ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచు ఇసాక్ , వడ్ల రాజశేఖర్, బోయ మౌలాలి తదితరులు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

నిధి పోర్టల్ ద్వారానే ఏపీజీఎల్ఐ కార్యకలాపాలు

కర్నూలు(అగ్రికల్చర్): అన్ని శాఖల ఉద్యోగులకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) వ్యవహారాలన్నీ ఇకపై నిధి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో జరుగుతాయి. ఇప్పటికే పాలసీదారుల పాలసీ, స్వీకరించిన ప్రీమియం, లోన్ పొందిన వివరాలను నిధి పోర్టల్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఏపీజీఎల్ఐ పాలసీ తీసుకున్న వారు, లోన్ పొందిన వారు ఆ పోర్టల్‌లో ఉన్న డేటాను పరిశీలించి ధ్రువీకరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా శాఖ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు ఏప్రిల్ 30 వరకు అవకాశం ఉంది. పాలసీ వారిగా డేటా ముద్రించిన కాపీలు ఆయా శాఖల డీడీవోల ద్వారా పాలసీదారులకు పంపిణీ చేస్తారు. నిధి పోర్టల్‌లో ఉద్యోగుల పాలసీ డేటాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే ఏప్రిల్ 30లోగా dir_ccell_apgli@ap.gov.in మెయిల్ ద్వారా ఏపీజీఎల్ఐ కార్యాలయం అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఏప్రిల్ 30లోగా సవరణల కోసం ఎలాంటి అభ్యంతరాలు ఇవ్వకపోతే నిధి పోర్టల్‌లో పెట్టిన డేటాను ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఖచ్చితమైనదిగా, అంతిమమైనదిగా పరిగణిస్తారని ఏపీజీఎల్ఐ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

రెండురోజులు నీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలో కృష్ణానగర్ ఐటీసీ సమీపంలో 500 ఎంఎం డయా పైప్‌లైన్ మరమ్మతులు చేపడుతున్నందున రెండు రోజుల పాటు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21, 22 వ తేదీల్లో నగరంలోని పాత కల్లూరు, క్రిష్ణానగర్, ఆదిత్య నగర్, కొత్తబస్టాండ్, జంపాల శివయ్య నగర్, తిలక్ నగర్, చల్లా వారివీధి (వార్డులు 26, 27, 33, 35, 42) లలో నీటి సరఫరా ఉండదని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలి



స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో అతిథులు

కర్నూలు కల్చరల్: అమ్మాయిలు అన్ని రంగాల్లో రాణించాలని డీఎస్పీ మహబుబ్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాటా మోటార్స్ ఫైనాన్స్ వారు ప్రొఫెషనల్ కోర్సు విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కల్లూరు ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ అమ్మాయిలు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టాటా సంస్థ ప్రతినిధులు ఈరన్న, రామకృష్ణ, మ్యాజిక్ బస్ సంస్థ క్లస్టర్ మేనేజర్ యాసిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కూటమిని ఓడించండి

కర్నూలు(సెంట్రల్) : కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ, దాని మద్దతుదారులను ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, సీపీఎం జిల్లాకార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. మంగళవారం సుర్జీత్ భవన్‌లో సీఐటీయూ ఓల్డ్‌సిటీ యూనియన్, దాని అనుబంధ సంఘాల సమావేశాన్ని నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..2014లో అధికారంలోకి వచ్చిన మోదీ 100 రోజుల్లో అన్ని రకాల ధరలు తగ్గిస్తామని, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, స్విస్ బ్యాంకు నుంచి భారతీయుల ధనాన్ని వెనక్కి తెప్పించి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి ఒక్కదాన్ని అమలు చేయలేదన్నారు. పైగా దేశ సంపదను అంబానీలు, అదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ,జనసేన కూటమికి ఓటు వేయద్దని, కాంగ్రెస్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ఇండియా కూటమికి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, నాయకులు మారేళ్ల విజయ్, రాజశేఖర్, రాజగోపాల్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించండి

కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వరుసలో నిలబడి విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని కర్నూలు విద్యుత్‌శాఖ రెవెన్యూ కార్యాలయం జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రామరాజు వినియోగదారులకు సూచించారు. మంగళవారం కర్నూలులోని వివిధ ప్రాంతాల్లో ఎండలో ఉండి విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండటాన్ని ఆయన పరిశీలించారు. మొబైల్ ఫోన్ ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించవచ్చని ఆయన స్పష్టం చేశారు. గూగుల్ పే, ఫోన్ పే ద్వారా ఎలాంటి అదనపు భారం పడకుండా బిల్లులు చెల్లించొచ్చని సూచించారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి

కర్నూలు (టౌన్) : ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి అని నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో రాజకీయ పార్టీల అధికారిక ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలని కోరారు. సమావేశంలో 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎఈఆర్ఓ, కర్నూలు అర్బన్ తహసీల్దార్ మోహన్‌కుమార్, అకౌంట్స్ అధికారి చుండీ ప్రసాద్ ఎన్నికల ప్రవర్తన నియమావళి అధికారి రంగస్వామి పాల్గొన్నారు.

నేడు సామూహిక భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: ఫాల్గుణ శుక్ల ఏకాదశిని పురస్కరించుకొని గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డి.వి. రమణ తెలిపారు. ధార్మిక చింతనాపరులైన వారు, సంఘం సభ్యులు, భక్తులు ఈ పారాయణంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ చైర్మన్‌గా అనంతరత్నం

కర్నూలు(సెంట్రల్): జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్‌గా అనంతరత్నంను నియమించారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రాన్ని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు ఆయనకు అందజేశారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు వెల్లడించారు.

కాంగ్రెస్‌లో చేరిక

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో ఆర్‌డీఓ, ఏజేసీగా విధులు నిర్వహించిన విశ్రాంత ఉన్నతాధికారి ఎస్.రామస్వామి కాంగ్రెస్‌లో చేరారు. అనంతపురంలో ఏఐసీసీ కార్యదర్శి శైలజనాథ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు, కార్యదర్శి కె.సత్యనారాయణగుప్తా పాల్గొన్నారు.

ఇద్దరు వలంటీర్ల తొలగింపు

కర్నూలు (టౌన్) : నగరంలోని కొత్తపేట 127 వ సచివాలయంలో పనిచేసే వలంటీర్లు జె. మనోజ్‌కుమార్, జరీనాలు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినందున తొలగిస్తున్నట్లు నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట ప్రాంతంలో రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

కేజీ రోడ్డులో ట్రాఫిక్ జామ్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు – గుంటూరు జాతీయ రహదారిపై వెంకాయపల్లె ఆలయ సమీపంలో మంగళవారం ట్రాఫిక్ స్తంభించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8గంటల వరకు రోడ్డుపై వందల వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో ఓ వైపు అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు, మరో వైపు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కల్వర్టు నిర్మాణం జరుగుతుండటం, మరోవైపు వాహనదారులు రెండువైపుల నుంచి ఎదురెదురుగా రావడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. విషయం తెలుసుకున్న కర్నూలు తాలూకా పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆటోలపై రాజకీయ బ్యానర్లు నిషేధం

కర్నూలు (టౌన్): 2024 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఆటో డ్రైవర్లు తమ ఆటోలపై రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, స్టిక్కర్లు అతికించకూడదని నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో ఆటో డ్రైవర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆటోలపై రాజకీయ పార్టీల పోస్టర్లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. లేకపోతే కేసులు నమోదవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీసీపీ సంధ్య, ఏసీపీ రంగస్వామి, శశిలత, ట్రాఫిక్ విభాగం ఏఎస్ఐ వాహిద్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్) : ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి/జేసీ నారపురెడ్డి మౌర్య కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఆమె గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాణ్యం నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు మధ్య ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థి రోజువారీగా చేసిన ఖర్చు వివరాలను తమకు ఏ రోజుకు ఆ రోజే పంపాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు ప్రచారంలో వినియోగించే బ్యానర్లు, జెండాలు, టోపీలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించే ప్రకటనలకు సంబంధించి కూడా రేటింగ్ కార్డు ఇస్తామన్నారు. మొదట సంబంధిత రేటింగ్ ప్రకారం అనుమతి తీసుకొని దాని ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే 48 గంటల ముందే అనుమతులు తీసుకొని నిర్వహించుకోవాలన్నారు. ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ , వీడియో వ్యూయింగ్ బృందాలు నియోజకవర్గంలో పర్యటిస్తూ అభ్యర్థుల ఖర్చులపై నిఘా వేసి ఉంటాయన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో అనుమతులు పొందే వివిధ యాప్‌లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాజకీయ ప్రతినిధులకు తెలియజేశారు. కాగా, ఎంసీసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ , వీడియో వ్యూయింగ్ బృందాల్లోని సభ్యులు రాజకీయాలకు అతీతంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన కొన్ని చోట ఉన్న రాజకీయ పార్టీల హోర్డింగ్‌లను తొలగించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని తొలగిచేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓర్వకల్లు, పాణ్యం తహసీల్దార్లు నటరాజు, ఫణికుమార్, రాజకీయ పార్టీల నుంచి టీడీపీ తరఫున ప్రశాంత్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ తరఫున సురేష్, సీపీఎం తరపునన రామకృష్ణ, బీఎస్పీ తరఫున చిరంజీవి పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు అండగా నిలవండి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటరును అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ప్రభుత్వం చేసిన మేలు మరువొద్దు
- ప్రతిపక్షాలకు ఓటుతో బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం కల్లూరు అర్బన్ 33, 41వ వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన మేలును ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షేమాన్ని ఇంటి ముగింటకే తెచ్చామన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలైనా వైఎస్ జగన్ మాదిరిగా ప్రజల దగ్గరకు పాలనను తీసుకొచ్చాయా అని అడిగారు. మీరు వివిధసేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లకుండా సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చిన వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఓటర్లను కోరారు. త్వరలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదలవుతుందన్నారు. అందులో రెట్టింపు సంక్షేమం ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నిరకల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సకాలంలో వైద్యం అందిస్తే మాతృమరణాలకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు (హాస్పిటల్): క్షేత్రస్థాయిలోని సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు కలసి గర్భిణులను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో సమయానుసారం వైద్య సేవలు అందించినట్లయితే మాతృ మరణాల శాతం తగ్గించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆయన తన చాంబర్‌లో మాతృ మరణాలు, జిల్లాస్థాయి సమగ్ర గర్భస్రావ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎర్రబురుజు యూపీహెచ్‌సీ పరిధిలో మార్చి నెలల సంభవించిన మాతృ మరణాలపై ఆయన సమీక్షించారు. గర్భిణులను హై రిస్క్‌గా గుర్తించి ఆశా, ఆరోగ్య కార్యకర్త, పర్యవేక్షకులతో ట్రాక్ చేసి సమీప సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రులు, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స అందించినట్లయితే మాతా శిశు మరణాలు తగ్గించవచ్చని తెలిపారు. గర్భిణుల కుటుంబ సభ్యులు కూడా వారి చికిత్సపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంటీపీ చట్టం గురించి వివరిస్తూ సురక్షిత గర్భస్రావ సేవలు అందించే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం తప్పనిసరిగా ఎంటీపీ యాక్ట్ ప్రకారం రిజిస్టర్ చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ మాధవి, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, శస్త్రచికిత్సల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల, అనస్థీషియా విభాగం నుంచి డాక్టర్ శ్రీలత, ఫాక్సీ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటరమణ, బ్లడ్ బ్యాంకు నుంచి డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మమత, డాక్టర్ సుగుణ, డాక్టర్ నర్మద, డాక్టర్ మనీషా, డాక్టర్ విజయభాస్కర్, డాక్టర్ భావన, డీపీహెచ్ఎన్ఓ ఇందిర, డెమో ప్రమీలా దేవి, హెచ్ఈఈఓ శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు టిప్పర్లు సీజ్



అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసిన జిల్లా మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని ఎదురూరు గ్రామం సమీపంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండి టిప్పర్లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. గ్రామం సర్వే నంబర్ 126లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సీజ్ చేసిన టిప్పర్లను కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ డిపోలో పెట్టామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికెళ్తూ.. ఓటర్లతో మమేకమవుతూ

- ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్
- మరింత మేలు జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థన



ఎన్నికల ప్రచారంలో ఓటరును ఆప్యాయంగా పలకరిస్తున్న ఇంతియాజ్, చిత్రంలో ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ నగరంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికెళ్తూ.. ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తున్నాడు. వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ..మరింత మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డితో కలిసి మంగళవారం కొత్తపేట రైతుబజార్ ప్రాంతంలో ఇంతియాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు, వ్యాపారులను కలిసి మాట్లాడారు. ఐదేళ్ల పాటు నిరాటకంగా సంక్షేమం అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మనందరం మళ్లీ గెలిపించుకోవాలన్నారు. జగన్ పరిపాలన నచ్చి ఐఏఎస్ పదవికి రాజీనామా చేసి తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నానన్నారు. మీరంతా అండగా నిలబడి గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేసిన ఇంతియాజ్ మచ్చ లేని పాలన అందించారన్నారు. అటువంటి వ్యక్తి మన కర్నూలు నుంచి పోటీచేయడం మనందరి అదృష్టమన్నారు. అందరం కలిసి ఇంతియాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మహేష్, మహిళా విభాగం నాయకురాళ్లు జమీలా, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కురేసి మసీదులో....

స్థానిక 3 వ వార్డు కురేసి మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందుకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ హాజరయ్యారు. సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే వైఎస్ జగనే సీఎంగా ఉండాలి

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని కర్నూలు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి స్పష్టం చేశారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ స్వగృహంలో నగరపాలక సంస్థ పరిధిలోని 1 నుంచి 11 వార్డుల పరిధిలోని వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ ముఖ్య నాయకులు, బూత్ ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నాయకులు అధికారం కోసం హామీలు ఇచ్చి తర్వాత విస్మరించేవారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి రికార్డు సృష్టించారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ గెలుపునకు ఎన్నికల్లో బూత్ ఇన్‌చార్జీలు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కురేసి మసీదులో ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న ఇంతియాజ్

పార్టీ గెలుపునకు కృషి చేయండి

పార్టీ గెలుపునకు రెడ్ల సంక్షేమ సంఘం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ కోరారు. స్థానిక ఏ. క్యాంపు వద్ద విజయసింహారెడ్డి స్వగృహంలో రెడ్ల సంక్షేమ సంఘం నాయకులను కలిశారు. వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ల సంక్షేమ సంఘం నాయకులు నరసింహారెడ్డి, నాగేశ్వర రెడ్డి, ఆనంద్ రెడ్డి, తిరుమలేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.